

డీఐజీ సెంథిల్ కుమార్ బదిలీ

కర్నూలు, జనవరి 29: కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ఆక్టోపస్ డీఐజీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కాకినాడ ఏపీఎస్పీ థర్డ్ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్ విజయరావును నియమించారు. అదేవిధంగా సెబ్ ఏఎస్పీ కృష్ణకాంత్ పాటిల్.. కాకినాడ ఏపీఎస్పీ థర్డ్ బెటాలియన్‌కు కమాండెంట్‌గా బదిలీ అయ్యారు.



తమ్ముళ్లలో జోష్

- టీడీపీ కార్యకర్తల్లో నూతనోత్తేజం నింపిన అధినేత
- పత్తికొండ రా.. కదలిరా సభకు వెల్లువెత్తిన జనం
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సాగిన ప్రసంగం
- ఉమ్మడి జిల్లాలో చంద్రబాబు సభ సక్సెస్‌పై చర్చ

(కర్నూలు-ఆంధ్రజ్యోతి):
టీడీపీ అధినేత పర్యటన తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపింది. చంద్రబాబు ప్రసంగం ఆద్యంతం ప్రజలను ఉర్రూతలూగించింది. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో విజయమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్నికలకు టీడీపీ శ్రేణులను సన్నద్ధం చేస్తూ మరో వైపు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఆదివారం పత్తికొండలో నిర్వహించిన రా.. కదలిరా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ విధానాలను తూర్పారబట్టారు. అంచనాలకు మించి జనం తరలి రావడంతో రెట్టింపైన ఉత్సాహంతో చంద్రబాబు ప్రసంగించారు. మొత్తంగా పత్తికొండ రా కదలిరా బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడంతో టీడీపీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది.



నాడు బాదుడే బాదుడు.. నేడు 'రా.. కదలిరా'

టీడీపీ అధినేత చంద్రబాబు 2022 నవంబరు 16,17,18వ తేదీల్లో పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో బాదుడే బాదుడు సభలు, రోడ్‌షోలలో పాల్గొన్నారు. ఆ సమయంలో చంద్రబాబు వెళ్లే మార్గంలో పల్లెపల్లెనా జనం నీరాజనం పలికారు. సభలకు వెల్లువెత్తారు. పాణ్యం, కోడుమూరు, ఆలూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు నియోజకవర్గాల పరిధిలో 11 మండలాల్లో 32 గ్రామాలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ మున్సిపాలిటీ పట్టణాల్లో చంద్రబాబు పర్యటన జరిగింది. ఆయా గ్రామాల్లో చంద్రబాబు రోడ్‌షో, బాదుడే బాదుడు సభకు 4-4.5 లక్షల మందికిపైగా ప్రజలు వచ్చి ఉంటారని నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఆ నివేదికను ప్రభుత్వానికి పంపారు. సరిగ్గా ఏడాది తరువాత చంద్రబాబు రా కదలిరా పిలుపుతో పత్తికొండకు వచ్చారు. ఇప్పుడు కూడా అదే రీతిలో జనం నీరాజనం పలికారు.

ప్రశ్నలు సంధిస్తూ.. ఉత్తేజం నింపుతూ

పత్తికొండ రా కదలిరా సభ సక్సెస్ చేసేందుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, వివిధ నియోజకర్గాల ఇన్‌చార్జిలు కేఈ శ్యాంబాబు, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కోట్ల సుజాతమ్మ, కె.మీనాక్షినాయుడు, పి.తిక్కారెడ్డి, టీజీ భరత్, ఆకెపోగు ప్రభాకర్ పది రోజులుగా కష్టపడి పని చేశారు. పల్లెపల్లెకు వెళ్లి రా కదిలిరా సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ సహా రాష్ట్ర నాయకులు ప్రభాకర్ చౌదరి, బీదా రవిచంద్రయాదవ్, భూమా అఖిలప్రియ, ఎన్‌ఎండీ ఫరూక్, గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి వంటి ముఖ్య నాయకులు సభా ఏర్పాట్లలో తాము సైతం అంటూ నిమగ్నమయ్యారు. పత్తికొండలో సభ ఏర్పాటు చేయడంతో ఆ నియోజకవర్గం ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు ప్రత్యేకంగా కష్టపడాల్సి వచ్చింది. నాయకుల సమష్టి కృషితో జనం వెల్లువలా తరలివచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయకుడు ప్రజలకు ప్రశ్నలు సంధిస్తూ.. ఉత్తేజం నింపుతూ ప్రసంగం సాగించారు. భస్మాసుర జగన్‌ను ఓటుతో అంతం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చివర్లో సైకో పోవాలి.. సైకిల్ రావాలి.. అనే పాటకు టీడీపీ శ్రేణులు స్టెప్పులు వేయగా వారి జోష్‌ను చూసి చంద్రబాబు వారిని మరింత ఉత్సాహపరిచారు.

సభ సూపర్ సక్సెస్‌పై చర్చ

పత్తికొండ రా కదలిరా బహిరంగ సభ అనంతరం సోమవారం రాత్రి అధినేత చంద్రబాబు హెలిపాడ్‌కు సమీపంలో గోపాల్ ప్లాజా ఫంక్షన్ హాల్‌లో రాత్రి బస చేశారు. సభ ముగిసిన తరువాత మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ సహా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, రాష్ట్ర పార్టీ ముఖ్య నాయకులతో చంద్రబాబు చిట్‌చాట్ నిర్వహించారు. సభ సక్సెస్ చేసిన అందరిని ప్రత్యేకంగా అభినందించారు. 'అదే క్రమంలో ఎన్నికలకు మిగిలిన సమయం 73 రోజులే.. ఇన్‌చార్జిలు, నాయకులు సంగ్రామానికి సిద్ధంగా ఉండాలి.. రాబోయే విజయం కోసం పని చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తల సేవలు గుర్తుంచుకుంటాను.. మన ప్రభుత్వంలో సరైన గుర్తింపు, సముచిత స్థానం ఉంటుంది. మీరు సిద్ధంగా ఉండండి' అంటూ దిశానిర్దేశం చేశారు.

చంద్రబాబు బహిరంగ సభ విజయవంతం

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు : కేఈ, బీటీ

పత్తికొండ/తుగ్గలి, జనవరి 29: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సభ విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం తుగ్గలి మండల కేంద్రంలోని తుగ్గలి నాగేంద్ర స్వగృహంలో వారు మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి కంచుకోటగా ఉన్న పత్తికొండలో రా కదలిరా బహిరంగ సభను లక్ష మందితో నిర్వహించాలని తలంచామని అన్నారు. ఇందుకు ఇన్‌చార్జిలు సుజాతమ్మ, తిక్కారెడ్డి, మీనాక్షినాయుడు, నాగేశ్వరరెడ్డి, ఆకెపోగు ప్రభాకర్, టీజీ భరత్ పూర్తి స్థాయిలో పని చేసి విజయవంతం చేశారని అన్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా బహిరంగ సభ జరగడం ఆనందంగా ఉందన్నారు. తుగ్గలి నాగేంద్ర తిరిగి పార్టీలోకి రావడం శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో మనోహర్‌చౌదరి, సురేష్‌చౌదరి, ధనుంజయ, గురుస్వామిలతోపాటు పలువురు నాయకులు ఉన్నారు. తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేస్తానని అన్నారు. చివరి వరకు పార్టీ కోసమే పని చేస్తానని చెప్పారు.



మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

జగనన్నా.. హైకోర్టు ఎక్కడన్నా..?

- హంద్రీనీవా పూర్తి చేయలేని అసమర్థుడు
- నాసికరం మద్యంతో పెరిగిన మరణాలు
- ప్రత్యేక హోదాపై బీజేపీని ప్రశ్నించే దమ్ముందా?
- సీఎం జగన్‌పై వైఎస్ షర్మిల ఫైర్
- ఉమ్మడి జిల్లా కార్యకర్తలతో సమావేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

కర్నూలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు అర్బన్: 'రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన జగనన్న కర్నూలుకు న్యాయ రాజధాని చేస్తానన్నాడు. అస్సలు ఇక్కడ ఏర్పాటు చేస్తానన్న హైకోర్టు ఏమైంది జగనన్నా...' అంటూ ఏపీసీసీ చీఫ్ షర్మిల సీఎం జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల సోమవారం తొలిసారి కర్నూలు జిల్లాకు వచ్చారు. నగరంలోని తనిష్క్ ఫంక్షన్ హాల్‌లో కర్నూలు, నంద్యాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఆయా జిల్లాల డీసీసీ అధ్యక్షులు బాబురావు, జె.లక్ష్మీనరసింహయాదవ్ అధ్యక్షతన జరిగింది. సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, జేడీ శీలం, కేవీపీ రామచంద్రరావు, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ ఆనాటి రాజశేఖరరెడ్డి పాలనకు.. ఇప్పటి జగనన్న పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. జగనన్న పాలనలో రాష్ట్ర పరిస్థితి ఘోరంగా మారిందన్నారు. ఎక్కడికెళ్లినా సమస్యలే.. ఈ ప్రభుత్వంపై పోరాటాలు చేయకపోతే మనం బాగుపడే పరిస్థితి లేదన్నారు. జగన్ ప్రభుత్వంపై పోరాటానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమా..? అంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మతతత్వ బీజేపీకి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యతిరేకి అయితే జగన్ బానిసగా మారాడని షర్మిల ధ్వజమెత్తారు.



కత్తి చూపుతున్న షర్మిల

నాసిరకం లిక్కర్ తాగొద్దు..

'సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా తేలేదు కానీ.. స్పెషల్ స్టేటస్ అంటూ నాసిరకం మందు తెచ్చి ప్రజల ప్రాణాలను హరిస్తున్నాడు. ఈ వైసీపీ పాలనలో ఇష్టం ఉన్నా లేకున్నా అమ్మిందే తాగాలి.. చెప్పిన ధరకే కొనుగోలు చేయాలి. డిజిటల్ చెల్లింపులు లేవు.. ఓన్లీ క్యాష్. దేశంలో ఇలాంటి పరిస్థితి ఏ రాష్ట్రంలోనైనా ఉందా? నాసిరకం మద్యం తాగడం వల్ల లివర్ చెడిపోయి ప్రాణాలు పోతున్నాయి. ఈ పాపం నీది కాదా జగనన్నా..' అని షర్మిల ప్రశ్నించారు. ఇలాంటి నాసిరకం మందు తాగకండి అని మందుబాబులకు ఆమె పిలుపునిచ్చారు.

జగన్ ఓ అసమర్థుడు

రాయలసీమకు జీవనాడిగా ఉన్న హంద్రీనీవా పనులు పదిశాతం పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం ఆ పనులను కూడా పూర్తి చేయలేని అసమర్థుడు సీఎం జగన్ అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం రైతులకు పంటల బీమా కూడా ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారన్నారు. రాబోయే ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని, 73 రోజుల ఇంటింటికి వెళ్లి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి బీజేపీ బానిస పార్టీలను ఇంటికి పంపాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు సుధాకర్‌బాబు, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దిలిప్‌దోకా, ఆదోని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు నీలకంఠప్ప, లక్ష్మీనారాయణ రెడ్డి, విల్సన్, దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రమీల, సేవాదళ్ అధ్యక్షురాలు అనంతవెంకట సుజాత తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల చెక్‌పోస్టు వద్ద రోడ్‌షోలో పాల్గొన్న వైఎస్ షర్మిల

తగ్గిన ఉల్లి ధర

- వీధుల్లో కేజీల ప్రకారం అమ్ముకుంటున్న రైతులు
- వంద రూపాయలకు ఆరు కేజీలు



గోనెగండ్ల, జనవరి 29: గత ఇరువై రోజులుగా ఉల్లి ధర తగ్గుముఖం పట్టింది. దీంతో సాగు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు. కర్నూలు మార్కెట్‌లో క్వింటం ధర రూ. 500 నుంచి రూ. 800 లకు ధర పలుకుతుంది. అయితే సరసరి మీద ఉల్లి పంట రూ. 600 మించి మార్కెట్ లో ధర పలకడం లేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌కు పోతే కనీస ధర కూడా పలకక పోవడంతో పాటు రవాణా ఖర్చులకు కూడా రావని తలచి ఇక చేసేది లేక రైతులు పొలాల దగ్గరనే వ్యాపారులకు క్వింటం ధర రూ. 500 విక్రయిస్తున్నారు. మరి కొంతమంది రైతులు ఆటోలలో ఉల్లి బస్తాలను వేసుకొని గ్రామాలలోని వీధుల్లో తిరుగుతూ రూ. 100 ఆరు కేజీల ప్రకారం అమ్మకాలు జరుపుతున్నారు. 50 కేజీ బస్తా రూ. 450 అమ్ముతున్నారు. ఈ ఏడాది దిగుబడి కూడా సగానికి పడిపోయింది. ఎకరంలో 300 బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా 200 బస్తాలకు మించి రాలేదని రైతులు తెలిపారు. కష్టపడి పండించిన పంటను వీధుల్లో తిరుగుతూ కేజీ ప్రకారం విక్రయించుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. గోనెగండ్ల మండలంలో దాదాపు 5000 ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. ఎకరానికి ఖర్చు దాదాపు రూ.80వేల నుంచి రూ. 90వేల వరకు వచ్చిందని, అయితే అప్పులు తీరే పరిస్థితి కూడా లేదని అన్నారు.

గిట్టుబాటు ధరలేక వీధినపడ్డాం: ఖాసీం, ఉల్లి రైతు, గోనెగండ్ల

ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేదు. దీంతో చేసేది లేక ఆటోలలో గ్రామాల్లో వీధుల్లో తిరిగి రూ. 100కు ఆరుకేజీల ప్రకారం అమ్ముకుంటున్నాం. మార్కెట్‌లో ధర పూర్తిగా పడిపోయింది. ప్రభుత్వం స్పందించి ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలి.

పోలీసు స్పందనకు 66 ఫిర్యాదులు

కర్నూలు, జనవరి 29: ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. బాధితుల నుంచి 66 ఫిర్యాదులు వచ్చాయి.

- రాజమండ్రి ఇరిగేషన్ డిపార్టుమెంటులో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకొని ఇవ్వడం లేదని, కన్సల్టెన్సీ పేరుతో కొంత మంది వ్యక్తులు మోసం చేశారని కర్నూలుకు చెందిన విష్ణు ఫిర్యాదు చేశారు.
- ఆస్తి కోసం తన కుమారుడు చంపుతానని బెదిరిస్తున్నాడని హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన ఈశ్వరప్ప ఫిర్యాదు చేశారు.
- తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి సర్వేయర్‌ను కొలతలు చేయనీయకుండా శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ అడ్డుపడుతున్నారని ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి ఫిర్యాదు చేశారు.
- పొలం కౌలుకు తీసుకున్న ప్రభాకర్, రంగన్నలు నకిలీ అగ్రిమెంటు సృష్టించి ఆరు ఎకరాల జొన్న పంటను దున్నేశాడని ఆస్పరి మండలం నగరూరు గ్రామానికి చెందిన ఉసేప్ప అర్జీ ఇచ్చారు.
- ట్రేడ్ కంపెనీ పేరుతో సైబర్ నేరస్థులు తన వాట్సాప్‌కు ఒక లింకును పంపి, ఫోన్‌లో ఉన్న డేటా సేకరించి తన ఖాతా నుంచి రూ.1.60 లక్షలు లాగేశారని సైబర్ ల్యాబ్ పోలీసులచే రికవరీ చేసి ఇప్పించగలరని ఎమ్మిగనూరు చెందిన రిజ్వాన్‌బాషా కోరారు.
- కడప జిల్లాకు చెందిన మంజునాథ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని నకిలీ ఉద్యోగాలు ఇప్పించి మోసం చేశాడని నాగులాపురం గ్రామానికి చెందిన ఉపేంద్ర, కర్నూలుకు చెందిన విష్ణు చరణ్‌లు ఎస్పీ ఎదుట వాపోయారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు సీఐలు ఉన్నారు.


నంద్యాలలోని ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు

డీఎస్సీ ఎప్పుడు..?

- నాలుగున్నరేళ్లుగా అభ్యర్థుల ఎదురుచూపు
- గత ఏడాది జూన్, ఆగస్టులో అన్నారు
- నవంబరులో ప్రకటిస్తామని బుకాయింపు
- సంక్రాంతి తర్వాత అని మంత్రి ప్రకటన
- నేటికీ ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం
- సర్కారు తీరుపై అభ్యర్థుల ఆగ్రహం

నంద్యాల (నూనెపల్లె), జనవరి 29: డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు గత ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. జూన్‌లో ప్రకటన విడుదల చేయకపోవడంతో ఆగస్టులో ప్రకటిస్తామని తర్వాత నవంబరులో ఇస్తామని మంత్రి పలుమార్లు కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 సంక్రాంతి సెలవుల అనంతరం వారంలో మెగా డీఎస్సీని విడుదల చేస్తామని మళ్లీ మంత్రి పేర్కొన్నారు.

నిరుద్యోగులకు డీఎస్సీ ప్రకటన కలగానే మిగిలిపోయింది. ప్రభుత్వ హామీలు నమ్మి నాలుగున్నరేళ్లుగా ఎదురుచూసి విసిగిపోయారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో నోటిఫికేషన్‌పై ఆశలు సన్నగిల్లుతున్నాయి. చివరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ గళం వినిపించేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. 2019 నుంచి ఇప్పటివరకు అభ్యర్థులకు ఎలాంటి డీఎస్సీ ఇవ్వకుండా తాత్సారం చేయడంపై అభ్యర్థులు వేలకు వేలు డబ్బులు ఖర్చు పెట్టుకొని శిక్షణ తీసుకొని సమయాన్ని వృథా చేసుకోవాల్సి వచ్చిందని వాపోతున్నారు.

ఖాళీలకు భారీగా గండి

వైసీపీ ప్రభుత్వంలో పాఠశాలల విలీనం హేతుబద్ధీకరణతో డీఎస్సీలో పోస్టులు ఖాళీలకు భారీగా గండి పడింది. 2021-2022, 2022-2023 విద్యాసంవత్సరాల్లో పాఠశాలల విలీనం, హేతుబద్ధీకరణ తర్వాత ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినా ఇంకా మిగులులో ఉన్నారు. 1నుంచి 3కి.మీ. పరిధిలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సమీప ఉన్నత పాఠశాలల్లో కలిపారు. ప్రాథమికంలో విద్యార్థుల సంఖ్య, ఏకమాధ్యమం, ఉన్నత పాఠశాలల్లో సెక్షన్లను కొలమానంగా తీసుకోవడంతో ఎస్జీటీ ఖాళీలు మిగులుగా గుర్తించారు.

నూతన విద్యావిధానం అమలుతో పోస్టులకు కోత

దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని నూతన విద్యావిధానం ఏపీలో మాత్రమే సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేయడంపై 117జీవోతో ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎస్జీటీ పోస్టులకు భారీగా కోత పడింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ఈ సమస్య తలెత్తింది. జీవోను రద్దు చేయాలని, నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు మొరపెట్టుకున్నా ప్రభుత్వం దాన్ని పెడచెవిన పెట్టింది. పాఠశాలల విలీనం, హేతుబద్ధీకరణతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీల్లో 1600, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 70తోపాటు ఎస్జీటీలో కన్నడం 30, ఉర్దూ 79 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితోపాటు ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను ఎంఈవో, ఎంఈవో-2 పోస్టులలో భర్తీ చేయగా వీరి స్థానాలలో, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో ఎస్జీటీలుగా ఉండి అర్హత ఉన్న ఉపాధ్యాయులను పదోన్నతులలో స్కూల్ అసిస్టెంట్లుగా భర్తీ చేయడంతో ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీల సంఖ్య గణనీయంగా తగ్గింది.



రెండు ప్రభుత్వాల్లో తేడాను గమనిస్తే

- టీడీపీ అయిదేళ్ల పాలనలో రెండు డీఎస్సీలు నిర్వహించింది. 2014లో, 2018లో పోస్టులకు ప్రకటనలు వెలువడ్డాయి. న్యాయస్థానం కేసుల కారణంగా 2018లో ప్రకటించిన పోస్టులనే ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం భర్తీ చేసింది.
- వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో డీఎస్సీ ద్వారా ఒక్క ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేయలేదు. 2008, 1998 డీఎస్సీ అభ్యర్థులను కనీస వేతన స్కేల్‌పై నియమించింది.
- కొత్త డీఎస్సీ కోసం 2020లో ప్రతిపాదనలు కోరినా కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు విద్యాశాఖ ప్రతిపాదనలు పంపింది.
- 2022 ఆగస్టులో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించారు. తర్వాత డీఎస్సీ ప్రకటన ఇప్పటి వరకు వెలువడలేదు.
- 2023 జూలై, ఆగస్టు, నవంబరులో డీఎస్సీ నిర్వహిస్తామని 2024లో సంక్రాంతి సెలవుల తర్వాత వారం రోజుల్లో డీఎస్సీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.

మళ్లీ టెట్ ప్రకటన అనడంపై మండిపాటు

డీఎస్సీ పరీక్ష రాయాలంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అర్హత సాధించాలి. ఈ క్రమంలో ప్రభుత్వం 2022 ఆగస్టులో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించింది. అప్పట్నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన పాపానపోలేదు. ఎన్నికల నేపథ్యంలో గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు డీఎస్సీ ప్రకటనపై మంత్రి బొత్స సత్యనారాయణ అదిగో.. ఇదిగో అనడమే తప్ప ప్రకటన వెలువరించలేదు. డీఎస్సీకి సీఎం జగన్మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని చెబుతున్నప్పటికీ ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం లేదు. సంక్రాంతి సెలవుల తర్వాత వారం రోజుల్లో కచ్చితంగా 6 వేల నుంచి 10 వేల లోపు డీఎస్సీ ప్రకటిస్తామని బొత్స చెప్పినప్పటికీ ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థులకు శుభవార్త అంటూ మళ్లీ టెట్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొనడంపై అభ్యర్థుల్లో అనుమానం, కోపావేశాలు రేకెత్తుతున్నాయి. డీఎస్సీ ఇవ్వకుండా మళ్లీ టెట్ ఏంటని అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. టెట్ ప్రకటించినా దరఖాస్తు చేసుకునేందుకు 15 రోజులు, పరీక్షకు సిద్ధపడేందుకు నెల రోజులు, అనంతరం పది రోజుల్లో ఫలితాలు వెల్లడించేందుకు నోటిఫికేషన్‌లో ప్రకటించినా ఎన్నికల నేపథ్యంలో ఇక డీఎస్సీని మరచిపోవాల్సిందేనని అభ్యర్థులు భావిస్తున్నారు.

ప్రభుత్వంపై అభ్యర్థుల ఆగ్రహం

నాలుగున్నరేళ్లుగా డీఎస్సీ విడుదల చేయకపోవడంపై అభ్యర్థుల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. పలుమార్లు ప్రకటించినా కార్యరూపం దాల్చకపోవడంపై మండిపడుతున్నారు. డీఎస్సీనే నమ్ముకున్న అభ్యర్థులు ఏ ప్రైవేట్ రంగంలోకి ఉద్యోగాలకై వెళ్లకుండా వ్యయప్రయాసలతో కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతూ డీఎస్సీ కోసం కళ్లు కాయలుకాచే విధంగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ వైఖరిపట్ల అభ్యర్థులు పెదవి విరుస్తున్నారు. ఎన్నికల సమయంలో కంటితుడుపు చర్యగా అరకొర పోస్టులతో డీఎస్సీని ప్రకటించినా అవి జరిగేపని కాదని భావిస్తున్నారు.

అల్లాబకాష్ చిరస్మరణీయ రంగస్థల నటుడు

కళాకారుల ఘన నివాళి


అల్లాబకాష్(ఫైల్)

కర్నూలు(కల్చరల్), జనవరి 29: సత్య హరి శ్చంద్ర పద్య నాటకానికి ఉమ్మడి రాష్ట్రంలో కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన నటుడు లొద్దిపల్లి అల్లాబకాష్ అని, కళకు మతం, కులం లేవని ఆయన నిరూపించారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. ప్రముఖ సీనియర్ రంగస్థల నటుడు, ఎన్టీయార్ స్మారక పురస్కార గ్రహీత లొద్దిపల్లి అల్లాబకాష్ (93) సోమవారం ఉదయం కర్నూలులోని ఆయన స్వగృహంలో వయోభారంతో కన్నుమూశారు. పలువురు రంగస్థల కళాకారులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లా నాటక రంగ ఖ్యాతిని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో చాటి చెప్పిన అల్లాబకాష్ చిరస్మరణీయ రంగస్థల నటుడని కొనియాడారు. అల్లాబకాష్ 1932లో లొద్దిపల్లిలో జన్మించారని, దివంగత సంగీత దర్శకుడు నందుల ఆంజనేయులు పర్యవేక్షణలో ఆయన ఇతర రాష్ట్రాల్లో అనేక నాటకాలు ప్రదర్శించారని గుర్తు చేసుకున్నారు. 1985లో నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీయార్ చేతుల మీదుగా పురస్కారంతోపాటు 2008లో ఎన్టీయార్ పురస్కారాన్ని అందుకున్న గొప్ప నటుడని అన్నారు. గజల్ గాయకుడు మహ్మద్ మియా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వంటివారంతా అల్లాబకాష్ నటనకు పులకించారని చెప్పారు. అల్లాబకాష్ నాటకాన్ని చూసేందుకు ఎద్దుల బండ్లు కట్టుకొని వచ్చేవారని కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళాకారులు కళాప్రియ తిరుపాలు, శ్రీనివాసరెడ్డి, ఆవులయ్య, భాస్కర్ యాదవ్, ఆనందరావు, ధనుంజయ, జయరాముడు తమ సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య, జిల్లా కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షుడు బైలుప్పల షఫీయుల్లా, హనుమాన్ కళా సమితి అధ్యక్షుడు పి. హనుమంతరావులు ఆయనకు నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, జనవరి 29: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కిరణ్ కుమార్(26) మృతి చెందాడు. గుత్తికి చెందిన కిరణ్ కుమార్, స్నేహితుడు మల్లేష్‌తో కలసి దైవ దర్శనం కోసం యాగంటికి మోటారు బైకుపై బయలుదేరారు. ప్యాపిలి సమీపంలోని బనగానపల్లి క్రాస్‌రోడ్డు దగ్గరకు రాగానే ప్రమాదవశాత్తు బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్‌కు బలమైన గాయాలు కాగా అక్కడి కక్కడే మృతి చెందగా మల్లేష్‌కు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బాధితుడిని డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం : సీఐడీ సీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐడీ సీఐ దస్తగిరి

కోడుమూరు, జనవరి 29: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సీఐడీ సీఐ దస్తగిరి అన్నారు. స్థానిక స్నేహ కళ్యాణ మండపంలో సీఐడీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ యాక్ట్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. కుల మత బేధాలు లేకుండా ప్రతి గ్రామంలో కలిసిమెలిసి జీవించాలన్నారు. ప్రజల రక్షణ కోసం చట్టాలు తీసుకొచ్చారని, చట్టాలు ఉన్నంత వరకు బీఆర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరి గుండెల్లో ఉంటాడని కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అసమానతలను రూపు మాపాలని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు, సీఐడీ ఎస్ఐ శ్రీనివాసులు, కుల, ప్రజా సంఘాల నాయకులు మునుస్వామి, నాగేష్, గఫూర్‌మియా, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై గొడ్డలితో దాడి

కోవెలకుంట్ల, జనవరి 29: కోవెలకుంట్ల మండలంలోని బిజనవేముల గ్రామానికి చెందిన బాలమ్మ అనే మహిళలపై అదే గ్రామానికి చెందిన గజ్జల దస్తగిరి గొడ్డలితో దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. గజ్జల హుసేనయ్య స్థలంలో బాలమ్మ గేదెలు కట్టేసుకొనేది. ఈ విషయంలో హుసేనయ్య కూతురుతో ఆమెకు చిన్న గొడవ జరిగింది. దీనిపై గజ్జల హుసేనయ్య ఆమె ఇంటి వద్దకు వచ్చి గొడవపెట్టుకొని గొడ్డలితో నరికాడు. దీంతో ఆమె ఛాతీ కింద గాయాయ్యాయి. బాలమ్మకు కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించారు. బాలమ్మ ఫిర్యాదు మేరకు గజ్జల హుసేనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

వైసీపీకి షాక్..

- టీడీపీలో చేరిన జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్
- అధినేత చంద్రబాబు సమక్షంలో చేరిక


టీడీపీ అధినేత చంద్రబాబు, బీటీ నాయుడు, తిక్కారెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సురేష్

కోసిగి, జనవరి 29: మంత్రాలయం నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రధాన అనుచరుడు, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ వైసీపీని వీడి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. టీడీపీలో చేరిన సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీ జెండా మోసిన వారికి విలువ లేదని, అధికారంలోకి రాక ముందు పార్టీ కోసం పని చేయించుకుని అధికారంలోకి వచ్చాక కార్యకర్తలను, నాయకులను వాడుకుని వదిలేశారని అన్నారు. వైసీపీలో సముచిత స్థానం లేకపోవడంతో మనోభావాలు దెబ్బతిన్నాయని, దీంతో టీడీపీలో చేరామని సురేష్ తెలిపారు. గతంలో వైసీపీ కోసం పని చేసిన వాళ్లను పక్కన పెట్టి, డబ్బులు ఇచ్చేవారికి పనులు చేస్తున్నారని అన్నారు. సురేష్ 2019 ఎన్నికల్లో కోసిగి మండలంతో పాటు నియోజకవర్గంలోని రాజకీయాల్లో కీలకంగా ఉన్న వ్యక్తులను వైసీపీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశాడు. అయితే సురేష్‌లో టీడీపీలో చేరడంతో వైసీపీ శ్రేణుల్లో వణుకు మొదలైంది.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించండి



కర్నూలు (కలెక్టరేట్), జనవరి 29 : జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ జి. సృజన అధికా రులను ఆదేశించారు. సోమవారం ఈఆర్‌ఓ, ఆర్డీఓ, తహసీల్దార్లు, ఎస్ఈ లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 23 నుంచి తుది ఓటర్ల జాబితాపై పత్రికల్లో వచ్చిన ప్రతి వ్యతిరేక వార్తను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు పంపాలని ఈఆర్‌ఓలను ఆదేశిం చారు. సెక్టార్ ఆఫీసర్లు అన్ని పోలింగ్ స్టేషన్‌లు తనిఖీ చేయాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్ఐలు బదిలీ

కర్నూలు, జనవరి 29: జిల్లాలో ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ జి.కృష్ణకాంత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్పరి ఎస్ఐ వరప్రసాద్‌ను కోవెలకుంట్లకు బదిలీ చేశారు. అలాగే దేవనకొండ ఎస్ఐ భూపాలుడును వెలుగోడు పీఎస్‌కు బదిలీ చేశారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.84 కోట్లు

మంత్రాలయం, జనవరి 29: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం జనవరి నెల 33 రోజుల హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించడం ప్రారంభించినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. మొదటిరోజు లెక్కింపు పూర్తి కాగా రూ.3,83,70,000 నగదు వచ్చినట్లు తెలిపారు. 2023 డిసెంబరు 27వ తేదీ నుంచి 2024 జనవరి 29వ తేదీ వరకు 33 రోజుల హుండీని గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కించినట్లు తెలిపారు. మంగళవారం నాణేలు, వెండి, బంగారు, వివిధ దేశాల డాలర్లు లెక్కించాల్సి ఉందని చెప్పారు.

ఉమ్రా యాత్రలో చాగలమర్రి వాసి మృతి

చాగలమర్రి, జనవరి 29: చాగలమర్రి గ్రామానికి చెందిన జంగాలపల్లె చాంద్‌బాషా(58) ఉమ్రా యాత్రకు వెళ్లి సోమవారం మృతి చెందాడు. చాంద్‌బాషా తన భార్య మాబుచాన్‌లతో పాటు కడప జిల్లాకు చెందిన మరో 25 మందితో ఆదివారం ఉమ్రా యాత్రకు హైదరాబాదు నుంచి విమానంలో సౌది అరేబియాకు వెళ్లాడు. మక్కాలో నమాజు చేసుకునేందుకు సిద్ధం కావడానికి రూముకు వెళ్లగానే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చాంద్‌బాషా అంత్యక్రియలను సౌదిలోనే జరుపుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషాతో పాటు టీడీపీ నాయకులు సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పంచలింగాలను సందర్శించిన తెలంగాణ ఆర్టీసీ ఎండీ

కర్నూలు, జనవరి 29: కర్నూలు మండలం పంచలింగాలలో ఉన్న శివాలయాన్ని తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోమవారం సందర్శించారు. ముందుగా బెటాలియన్ గెస్టుహౌస్‌కు చేరుకున్న ఆయన కాసేపు సేద తీరి అనంతరం శివాలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. శివాలయం వచ్చిన ఈయనకు ఆలయ పూజారులు, సీఐ శ్రీరాములు, ఎస్ఐ సమీర్‌లు ఘనస్వాగతం పలికారు. సజ్జనార్ ఆలయంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

పకడ్బందీగా ప్రాక్టికల్స్ నిర్వహించాలి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 29 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ మధుసూదన్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేది నుంచి ఒకేషనల్ విద్యార్థులకు, 11 వ తేది నుంచిజనరల్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలపారు. కార్యక్రమంలో ఆర్‌ఐఓ గురువయ్య శెట్టి, డీవీఈఓ జమీర్‌బాష, లాలప్ప పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 29: జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు గాంధీ మహాత్ముని వర్ధంతి సందర్భంగా జిల్లాలో జరిగే కుష్ఠు వ్యాధి అవగాహన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కర్నూలు కలెక్టర్ డా.జి.సృజన పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పక్షోత్సవాల పోస్టర్‌ను జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు, డీఎంహెచ్‌వో రామగిడ్డయ్య, అడిషినల్ డీఎంహెచ్‌వో భాస్కర్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి అనేది మైక్రో బ్యాక్టీరియా లెప్రి అనే సూక్ష్మ క్రిమి వల్ల వస్తుందని, ఈ వ్యాధిని త్వరగా గుర్తించి నిర్మూలిస్తే ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాపించకుండా అరికట్ట వచ్చునన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, నరాలు వాపు, జోములు, కాళ్లకు చెప్పులు జారి పోవడం వంటి లక్షణాలు ఉన్న ఎడల ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్యున్ని సంప్రదించాలన్నారు. కుష్ఠు వ్యాధికి ఎండీటీ మందులు పూర్తిగా ఉచితంగా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఎంవో మల్లికార్జున, హెచ్‌ఈవో శివశంకర్‌రావు, డీపీఎంవో హక్ పాల్గొన్నారు.


కుష్ఠు వ్యాధి పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, డీఎంహెచ్‌వో

నేడు సీక్యాంపు రైతుబజారు బంద్

-ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 29: కర్నూలు నగరంలోని సీ క్యాంపు రైతుబజారులో మంగళవారం కూరగాయల విక్రయాలు జరగవని ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్ తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచే కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా రైతులు కూరగాయలను మంగళవారం సీ క్యాంపు రైతుబజారుకు తీసుకు రావద్దని అన్నారు. అదేవిధంగా వినియోగదారులు కూడా కూరగాయలను కొనడానికి రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

అలాంటి పండ్లను విక్రయానికి తేవద్దు

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 29: మార్కెట్‌లో కొంత మంది వ్యాపారులు కాల్షియం కార్బైడ్‌తో మాగబెట్టిన పండ్లను సీ క్యాంపు రైతుబజారుకు తీసుకురావద్దని ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని సీ క్యాంపు రైతుబజార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అరటి, మామిడి, బొప్పాయి, యాపిల్, సపోట వంటి వివిధ రకాల పండ్లను కృత్రిమంగా కాల్షియం కార్బైడ్ ద్వారా మాగబెట్టి వినియోగదారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ విధంగా క్యాల్షియం కార్బైడ్ ద్వారా మాగబెట్టిన పండ్లను తిన్న వారికి క్యాన్సర్, అల్సర్, కాలేయం, మూత్ర పిండాలు నాడి సంబంధిత వ్యాధులతోపాటు కళ్ల మంటలు, వాంతులు డయేరియా అదేవిధంగా గర్భస్రావ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా అరటి, మామిడి పండ్లను ఇథలిన్ గ్యాస్ ద్వారా మాగబెట్టు గదులు ఏర్పాటు చేసుకోవడానికి 40 శాతం రాయితీ అందిస్తోందని, ఈ అవకాశాన్ని వ్యాపారులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్పందన అర్జీలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 29: జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలనిలి నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ అన్నారు. సోమవారం కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అర్జీదారులను సచివాలయాలకు పిలిపించుకొని పరిష్కారానికి సంబంధించిన ఎండార్స్‌మెంట్ వారి చేతికి ఇచ్చినట్లు రశీదును పొందాలని అన్నారు. అయితే కొందరు వాటిని పాటించడం లేదని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంతోష్‌నగర్, ప్రేమనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని, తుంగభద్ర కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీలలో మురుగునీటి వ్యవస్థ నిర్మించాలని, టిడ్కో ఇళ్లలో గృహం కేటాయించాలని చత్రిబాగ్‌కు చెందిన మహేశ్వరి కమిషనర్‌కు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే విశ్వేశ్వరరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శశికళ, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 29: నగరంలో దోమలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల నగరంలో దోమలవ్యాప్తి ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో స్పందించిన అధికారులు సోమవారం యాంటివైరల్ ఆపరేషన్‌లో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని పాలు ప్రాంతాలలో నీరు నిల్వ ఉన్న చోట్ల, కాలువల్లో సిబ్బంది దోమల నివారణకు పిచికారి చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. స్టాంటాన్‌పురం,శరీన్‌నగర్‌లోని పాఠశాల విద్యార్థులకు మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

సెర్ప్ ఉద్యోగుల నిరసన ర్యాలీ



నిరసన తెలియజేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

కర్నూలు(కలెక్టరేట్) జనవరి 29 : సమస్యలను పరిష్కరించాలని 7వ రోజు సోమవారం సెర్ప్ ఉద్యోగులు వాల్మీకి సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినితి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పే స్కేలు అమలు చేయాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 23 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళ సంఘాలు, వీఓఏ, ఎమ్మెస్ అకౌంటెంట్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన నాయకులు

ఓర్వకల్లు, జనవరి 29: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును పత్తికొండకు రా.. కదిలిరా కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో చింతలపల్లె సర్పంచ్ వెంకటరమణ, పాలకొలను మండల నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేశారు.

వైసీపీ కార్యకర్తలా కమిషనర్ మాట్లాడటం సరికాదు

గూడూరు, జనవరి 27: గూడూరు నగర కమిషనర్ ప్రసాద్ గౌడ్ వైసీపీ కార్యకర్తలా మాట్లాడటం సరికాదని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. సోమవారం గూడూరులో టీడీపీ అధ్యక్షుడు గజేంద్రగోపాల్ నాయుడు, టీడీపీ అధికార ప్రతినిధి దండు సుందరరాజు, టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి నాగప్ప యాదవ్ మాట్లాడుతూ గూడూరులో ఆదివారం జరిగిన వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ప్రసాద్ గౌడ్ వైసీపీ కార్యకర్తలా మాట్లాడం, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌ను మంత్రిగా చూడాలని ఉందని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కమిషనర్‌కు అంతగా రాజకీయం చేయాలని ఉంటే రాజీనామా చేసి రాజకీయం చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడిన తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీల్లో రెండో స్థానంలో ఏపీ జట్టు

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 29: ఈ నెల 27 నుంచి 29 వరకు తెలంగాణ రాష్ట్రం షాద్‌నగర్‌లో జరిగిన జాతీయ స్థాయి రూరల్ ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్స్ బాలుర, బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ బలుర, బాలికల జట్టు రెండో స్థానం కైవసం చేసుకుంది. సోమవారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో డీఎస్‌డీవో రమణ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్రటరీ బి.వేణుగోపాల్, సెక్రటరీ శ్యాం కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డిపై వైసీపీ విమర్శలు

కల్లూరు, జనవరి 29: చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన పుసులూరు ప్రభాకర్ రెడ్డిపై వైసీపీ నాయకులు సోమవారం విలేకరుల సమావేశంలో విమర్శలు గుప్పించారు. ఆయన ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి అనుచరుడు కాదని, అతనికి వైసీపీకి సంబంధం లేదని కర్నూలు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వై.రామకృష్ణారెడ్డి, కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత రెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

మూడు తరాల బంధాలు

- ఒకే వేదికపై 130 మందికి పైగా కుటుంబసభ్యులు



మూడు తరాల ప్రతినిధులతో వేముల రోషయ్య కుటుంబం

కర్నూలు(కల్చరల్), జనవరి 29: వేముల రోశయ్య కుటుంబ పరంపరలో మూడు తరాలకు చెందిన 130 మందికి పైగా ఒకే చోట కలిశారు. 'ఏరా' అంటూ ఆప్యాయంగా పిలుపులు...'మీరా' ఆశీర్వదించండి అంటూ నమస్కారాలు.. పెద్దలు, పిల్లలు, యువతీ యువకులు ఇలా ఆ ఉమ్మడి కుటుంబ సభ్యులంతా ఒక్కటై సందడి చేశారు. రోజంతా అవధులు ఆనందంతో అంతా పులకించి పోయారు. చిన్ననాటి సంగతులు కలబోసుకున్నారు. పరామర్శలతో, చెమర్చిన కళ్లలో ఆలింగనాలు చేసుకున్నారు. నగరంలోని వేముల రోశయ్య శెట్టిది పెద్ద కుటుంబం. సోదరీ సోదరులు, వారి పిల్లలు, వారి మనుమలు ఇలా ఈ కుటుంబంలో 130 మందికి పైగా ఉన్నారు. వేముల రోశయ్య మనవళ్లు రమేష్‌బాబు, ప్రతాప్, చంద్రశేఖర్ వివిధ ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబ సభ్యులందరినీ కలిపేందుకు వేదికను సిద్ధం చేశారు. సోమవారం నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో తమ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. వేముల రోశయ్య శెట్టి కుటుంబ సభ్యుల్లో ముఖ్యులైన ప్రతాప శంకరయ్య, సుబ్బలక్ష్మమ్మ, కొత్తూరు సత్యమ్మ, లింగం సుబ్రహ్మణ్యం, వేముల రాఘవేంద్ర, పిల్లలను ఆశీర్వదించారు.

చంద్రబాబే రాష్ట్రానికి సరైన నేత

● టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, జనవరి 29: రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించగలిగే చంద్రబాబు మాత్రమేనని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత అన్నారు. సోమవారం మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహానాడులో నారా చంద్రబాబు నాయుడు భారీ వరాలతో టీడీపీ మొదటి మేనిఫెస్టో విడుదల చేసి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చి పథకాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని పథకాలన్నీ అమలు చేస్తామన్నారు. గత టీడీపీ హయాంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి పేదల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ఓటర్లు, ప్రజలు మరోసారి మోసపోకుండా చంద్రబాబును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, వెంకటరమణ, సుధాకర్‌రావు, శ్రీనివాసులు, రామకోటేశ్వరరావు, మధుసూదన్‌గౌడు, చంద్రప్ప, విజయుడు, మాధవరావు, హరిరామ్, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, అయ్యస్వామి, పెద్దగిడ్డయ్య, అల్లాబాబు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామానికి చెందిన వైసీపీ వార్డు మెంబర్లు రాజు, అరుణాదేవిలతో పాటు వైసీపీ నాయకులు హరిలు టీడీపీలో చేరారు. వారికి గౌరు చరిత పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.



ఎన్. కొంతలపాడులో టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న గౌరు చరిత

వైసీపీని ఇంటికి సాగనంపాలి..

కర్నూలు(రూరల్): రాష్ట్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పార్టీని ఇంటికి పంపెందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కోడుమూరు నియోజకవర్గం టీడీపీ యువ నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు నష్టపోవడమే కాకుండా అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కోడుమూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న గీతాముఖర్జీనగర్, మమతానగర్, సమతానగర్‌లో సోమవారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్, సీతన్న, మహబూబ్‌బాషా, అయ్యన్న, వెంకటేశ్వర్లు, అబ్రహం, సూరి, చాంద్, దేవరాజు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గీతాముఖర్జీ నగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న దస్తగిరి

దోమల నివారణ చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 29: నగరంలో దోమల నివారణకు చర్యలు చేపట్టకపోతే నగర పాలక సంస్థను దిగ్బంధనం చేస్తామని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ హెచ్చరించారు. నగరంలో దోమల వ్యాప్తిని అరికట్టాలని కోరుతూ సోమవారం సీపీఎం అధ్వర్యంలో కార్పొరేషన్‌ను ముట్టడించారు. కమిషనర్ డౌన్ డౌన్ అంటూ కార్యాలయం తలుపులను పగలకొట్టుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇంతలో పోలీసులు రంగప్రవేశం చేసి తలుపులకు తాళం వేసి కమిషనర్‌ను పిలిపించి నాయకులతో మాట్లాడించారు. ప్రస్తుతం దోమల నివారణ కోసం చర్యలు చేపట్టామని, మరిన్ని ప్రాంతాలలో కూడా చేపట్టి దోమల నుంచి ప్రజలను రక్షిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల, మాజీ కార్పొరేటర్ ఇరిగినేని పుల్లారెడ్డి, పాతబస్తీ కార్యదర్శి రాజశేఖర్, రాధాక్రిష్ణ, ఆనంద్‌బాబు, గురుశేఖర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇనగండ్లలో పల్లె నిద్ర

సి, బెళగల్, జనవరి 29: మండలంలోని ఇనగండ్ల గ్రామంలో సోమవారం ఎస్ఐ మన్మథ విజయ్ పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక నిఘా పెట్టామని అన్నారు. తరచూ గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దేవాలయాలు, చర్చిల దగ్గర, పబ్లిక్ ఎక్కుగా ఉన్న ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే మద్యం, పేకాట, గుట్కా వంటివి విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి

సి. బెళగల్, జనవరి 29: బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ శేషఫణి బీఎల్‌వోలకు ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీడీవో సందీప్ ఆధ్వర్యంలో బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల్ల మౌలిక వసతులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి ఆదాంబాషా, ఏఎస్‌వో ఆదినారాయణ, ఎంపీడీవో సందీప్, బూత్ లెవల్ అధికారులు ఉన్నారు.

'ఫైఫర్ టూ నైఫర్'పై సెమినార్

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 29: కర్నూలు నగరంలో సీ క్యాంపులోని ఫైఫర్ ఫార్మశీ కళాశాలలో సోమవారం ఫైఫర్ టు నైఫర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని బీఫార్మశీ విద్యార్థులు ఏ విధంగా జీపీఏటీ ర్యాంకులు సాధించి నైఫర్‌లో అడ్మిసన్ కోసం ఏ విదంగా ప్రిపరేషన్ చేసుకోవాలో అదే విధంగా నైఫర్‌లో సీటు సాధించడం ఎలా వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జే.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.కాసర్ల సురేష్, అకడమిక్ డీన్ డా.రాజ్‌కుమార్, కోఆర్డినేటర్ ఆర్.రఘువీర్ పాల్గొన్నారు.

క్రైస్తవుల మహా ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 29: క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఆంధ్రప్రదేశ్ క్రైస్తవుల హక్కుల సమితి ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి క్రైస్తవులందరూ తరలిరావాలని సమితి కన్వీనర్ కే.హవిలాన్‌బాబు, కోకన్వీనర్లు ఎస్.జయకాంత్, కేజే విజయకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం హోటల్ మౌర్యఇన్ వద్ద మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పులిజాకోబ్, ఏవైఎన్ బాబు, గ్లోరీ ప్రకాష్, సుందర్ రాజు, డేవిడ్ సుందర్‌లు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు ఉన్నా సర్వే చేయడం లేదు

కర్నూలు(రూరల్), జనవరి 29: డాక్యుమెంట్లు ఉన్నా తన స్థలం సర్వే చేయడం లేదని గార్గేయపురం గ్రామానికి చెందిన పి.రాజేశ్వరరెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. గార్గేయపురంలో తన ఇంటి ముందు ఉన్న స్థలంతోపాటు వెనక భాగంలో కల్లందొడ్డి స్థలం కలిపి దాదాపు 10సెంట్లు ఉందని, సర్వే చేసి ఆన్‌లైన్‌లో ఎక్కించాలని సచివాలయ అధికారులకు దరఖాస్తు పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు తెలిపారు.

సిద్ధయ్య మృతి టీడీపీకి తీరని లోటు

గూడూరు, జనవరి 29: టీడీపీ సీనియర్ నాయకుడు సిద్ధయ్య లేని లోటు టీడీపీకి తీరనిదని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు బొగ్గుల దస్తగిరి, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరు మండలంలోని పొన్నకల్ గ్రామంలో టీడీపీ నాయకుడు సిద్ధయ్య అనారోగ్య కారణంగా మృతి చెందాడు. బొగ్గుల దస్తగిరి, మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు పొన్నకల్ గ్రామం చేరుకొని సిద్ధయ్య పార్థీవ దేహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రేమట వెంకటేష్, టీడీపీ కౌన్సిలర్లు మల్లాపు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, పౌలు, సత్యరెడ్డి, ముడుమాల పౌలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కర్నూలు(కల్చరల్), జనవరి 29: నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ పాతనగరంలోని ఓల్డ్‌టౌన్, 2, 3 వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్‌గా విశ్వేశ్వరరెడ్డి

కర్నూలు(కల్చరల్), జనవరి 29: కర్నూలు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్‌గా మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే విశ్వేశ్వరరెడ్డిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ శివారెడ్డి, సెక్రటరీ షేక్ మాలిక్ బదిలీ అయ్యారు. ఈ క్రమంలో నగరపాలక సంస్థలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న నాగరాజును సెక్రటరీగా నియమించారు. సోమవారం నాగరాజు బాధ్యతలు స్వీకరించారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనర్

కల్లూరు, జనవరి 29: రానున్న ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని అర్బన్ వార్డుల ఇన్‌చార్జి పెరుగు పురుషోత్తం రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, మాదేష్ పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు అర్బన్, రూరల్‌లో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు పోలింగ్ బూతుల వారిగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ చేపట్టాలన్నారు. బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ చేర్చాలని అన్నారు. కార్యక్రమంలో ఉలిందకొండ టీడీపీ నాయకుడు ఈవీ.రమణ, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్వీ.రామకృష్ణ, పెద్దటేకుపల్లి, బాబురాజు, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



టీడీపీ అధినేత చంద్రబాబుకు రైతు సమస్యలను వివరిస్తున్న కోట్ల, గౌరు చరిత

కల్లూరు, జనవరి 29: కల్లూరు మండలం కొంగనపాడులో 140 క్వింటాళ్ల మిర్చిపంటను కాలిపోయి రూ.30 లక్షల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారని గౌరు చరిత తెలిపారు. ఆదివారం కర్నూలు జిల్లా పత్తికొండలో జరిగిన రా కదలి రాకు విచ్చేసిన చంద్రబాబుకు మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరిత రైతుల గోడు వివరించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పాల్గొన్నారు.

నగరంలో షర్మిల రోడ్‌షో



ప్రజలకు అభివాదం తెలుపుతున్న షర్మిల, నంద్యాల, కర్నూలు డీసీసీ అధ్యక్షులు జే.లక్ష్మీనరసింహ యాదవ్, కె.బాబురావు

కర్నూలు(అర్బన్), జనవరి 29: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిల సభకు భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. సోమవారం ఉదయం పీసీసీ హోదాలో తొలిసారిగా జిల్లాకు రావడంతో ఆమెకు నగర శివారులోని నంద్యాల చెక్ పోస్టు వద్ద డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ, బాబురావులు గజమాలతో పూలమాలలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీ క్యాంప్ చేరుకుని రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి కలెక్టరేట్, రాజవీహార్, ఆనంద్ టాకీస్, ఇందిరాగాంధీ నగర్, సీతారాంనగర్, మీదుగా వెంకటరమణ కాలనీలోని తనిష్క ఫంక్షన్ హాలుకు భారీ ర్యాలీగా చేరుకుని ముఖ్యకార్యకర్త సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి నాయకులు సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, గిడుగు రుద్రరాజు, కేవీ రామచంద్రరావు ఆమెకు ఘన స్వాగతం పలికారు. 70 రోజులు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఇంటింటికి తిరిగి రాజన్న రాజ్యం తెచ్చి అన్ని వర్గాల ప్రజలు తలెత్తుకొని బతికేలా చేయడమే తన ఆశయమని ఆమె కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. షర్మిల రాకతో కాంగ్రెస్ నాయకుల్లో జోష్ వచ్చినట్లయింది.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మాదిగ దండోరా వ్యవస్థాప అధ్యక్షుడు అనంతరత్నం



ర్యాలీ నిర్వహిస్తున్న మాదిగ దండోరా నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 28: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతరత్నం మాదిగ అన్నారు. సోమవారం నగరంలోని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం వద్ద నుంచి అంబేడ్కర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే ఏబీసీడీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. దండోరా నాయకులు టీడీపీకి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, బీ జేమ్స్, ధరూర్ జేమ్స్, బోరెల్లి వీరన్న మాదిగ ఎన్ సోమసుందరం మాదిగ పాల్గొన్నారు.

షటిల్ విజేత స్టాంటన్‌పురం జట్టు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 29: ఆడుదాం-ఆంధ్రాలో భాగంగా ప్రభుత్వం నిర్వహించిన షటిల్ పోటీల్లో స్టాంటన్‌పురం సచివాలయ పరిదిలోని జట్టు గెలిచింది. సోమవారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో బుధవారపేట కిందిగేరి నుంచి వి.అజయ్‌కుమార్, వి.అక్షయ్‌లతో స్టాంటాన్‌పురం నుంచి రాహుల్, చెన్నబోయిన మన్విత్ మధ్య పోటీ జరిగింది. అయితే బెస్టాఫ్ త్రీలో స్టాంటాన్‌పురం జట్టు మొదటి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి విజేతగా నిలిచారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు ఎం.మహబూబ్‌ఖాదర్ పాల్గొన్నారు.

'నాసిరకంగా నూతన కార్యాలయ నిర్మాణం'

కర్నూలు(న్యూసిటీ), జనవరి 29: నగర పాలక సంస్థ నూతన కార్యాలయ నిర్మాణంలో నాసిరకంగా పనులు జరుగుతున్నాయని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి విమర్శించారు. సోమవారం పాత భనం వెనుక నిర్మిస్తున్న నూతన కార్యాలయ నిర్మాణ పనులను కమిటీ బృందం పరిశీలించింది. పుల్లారెడ్డి మాట్లాడుతూ పనులు నాసిరకంగా జరుగుతున్నా అక్కడే ఉన్న మేయర్, కమిషనర్ ఎందుకు చూడడం లేదని ప్రశ్నించారు. నాసిరకం పనులపై కఠిన చర్యలు తీసుకుంటామని గతంలో కమిషనర్ భార్గవతేజ ప్రకటించినప్పటికీ ఇంజనీర్లలో మార్పు రావడం లేదని అన్నారు. 2022 ఆగస్టు 1న సుమారు రూ.28 కోట్లతో భవన నిర్మానానికి భూమి పూజ చేశారని, కార్యాలయం నిర్మాణ ప్రారంభంలో వేసిన సిమెంట్ బెడ్ నెల తిరక్కముందే కంకర తేలిందని అన్నారు. తక్షణమే నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాకోబు, రమణగౌడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

● టీడీపీ నాయకుడు అబ్జర్వర్ ముర్తుజావలి



సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ ముర్తుజావలి

ఓర్వకల్లు, జనవరి 29: అందరూ 75 రోజుల పాటు సైనికుల్లా పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని టీడీపీ నాయకుడు అబ్జర్వర్ ముర్తుజావలి పిలుపునిచ్చారు. సోమవారం ఓర్వకల్లులో బూత్ స్థాయి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ముర్తుజావలి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా విడుదల చేసిన ఓటరు జాబితాను పరిశీలించాలని సూచించారు. ఓటర్లను తొలగించిన బోగస్ ఓట్లు ఉన్నా అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. జగన్ ఎన్నికలకు సిద్ధమవుతుంటే.. ప్రజలు ఆయనకు స్వస్తి పలికేందుకు తయారవుతున్నారన్నారు. బూత్ స్థాయి ఇన్‌చార్జిలు పథకాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఎంతైనా ఉందన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు బూత్ స్థాయి ఇన్‌చార్జిలు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో చింతలపల్లి సర్పంచ్ వెంకటరమణ, టీడీపీ నాయకులు చదువుల సుధాకర్ రెడ్డి, సుధాకర్ రావు, రమణారెడ్డి, టీకే సుధాకర్, అల్లాబాబు, గిడ్డయ్య, మౌలీశ్వరరెడ్డి, బూత్, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

బకాయిలను విడుదల చేయాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 29 : పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, శివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ 11వ పీఆర్సీ అరియర్స్ చెల్లించాలని, హెల్త్‌కార్డు ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన హాస్పిటల్‌లో వైద్యం అందించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాశన్న, మద్దిలేటి, రాజారెడ్డి పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా

కర్నూలు (కలెక్టరేట్), జనవరి 29 : కర్నూలు సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో 1వ తేదీన నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కలెక్టర్ జి.సృజన తెలపారు. సదరు జాబ్ మేళాలో పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ చదిన యువతీ యువకులు పాల్గొని ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు.

నీటిలో సూక్ష్మ పోషకాలు ఉండాలి

కర్నూలు(హస్పిటల్), జనవరి 29: నీటిలో మంచి సూక్ష్మ పోషకాలు ఉండాలని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డా.సుధాకర్ అన్నారు. కల్లూరు మండలంలోని పెద్దటేకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. లీటరు మంచి నీళ్లలో 1.5 మిల్లీ గ్రాములు కంటే ఎక్కువ ఉంటే మన ఫ్లోరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఫ్లోరోసిస్ అనే వ్యాధి వలన దంతాల మీద అడ్డంగా పసుపు రంగు గీతలు ఏర్పడుతాయని, దంతాలు గోధుమ రంగులో ఉంటాయని తెలిపారు. చిగుళ్ల మధ్య నల్లగా ఉండి, చాకోపీసు రంగులోకి దంతాలు మారి, దంతాలు గుంటలు గుంటలుగా ఏర్పడి పిప్పి పళ్లుగా తయారవుతాయని హెచ్చరించారు. ఆహారం సరిగ్గా నమలలేకపోవడం వల్ల తలనొప్పి రావడం, దంతాలకు రంధ్రాలు పడటం వల్ల సరైన పోషకాహారం తీసుకోక, అనేక వ్యాధులకు గురవుతారన్నారు. ఈ వ్యాధి ఉన్న వారు టూత్ పేస్టును గింజంతా మోతాదులో తీసుకోవాలని ఉదయం, సాయంత్రం రెండు పూటలా బ్రష్‌తో కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సురేష్ కుమార్ రెడ్డి, ఆరోగ్య సామాజిక ఆరోగ్య అధికారి శిరీష, ప్రాజెక్టనిస్టు ఖలీల్, ఆశాలు పాల్గొన్నారు.



ఫ్లోరోసిస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డా.సుధాకర్, ఉపాధ్యాయులు

రైతు జాతర

● అమ్మకానికి ఎద్దులు, వ్యవసాయ పనిముట్లు
● ఆశించిన ధరలు రాక నిరుత్సాహానికి గురైన రైతులు, వ్యాపారులు



అమ్మకానికి ఉంచిన ఎద్దులను అలంకరించే మెడార్లు, తాళ్లు, సిక్కంలు

ఎమ్మిగనూరు, జనవరి 29: ఎమ్మిగనూరు పట్టణంలో ప్రతి ఏడాది జరిగే నీలకంఠేశ్వరస్వామి జాతర రైతుల జాతరగా పేరుగాంచింది. జాతర, తిరుణాల అంటే సాధారణంగా మిఠాయిలు, పిల్లల ఆటవస్తువులు, పసుపు కుంకుమలు, కుంకుమ, గాజులు, అలంకరణ వస్తువులు విక్రయిస్తూ ఉంటారు. అయితే ఎమ్మిగనూరు జాతరలో మాత్రం వ్యవసాయానికి అవసరమైన ఎద్దులు, పలుగు, పార, నాగలి, గొర్రు, దంతెలు, కాడిపనిముట్లు వంటివి విక్రయిస్తాయి. దీంతో ఇది రైతు జాతర అని చెప్పొచ్చు. పట్టణ శివారులోని మంత్రాలయం రోడ్డు సమీపంలో ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలోకి ఎద్దులు, కోడెలు, దూడలను రైతులు రెండురోజుల ముందే తరలించారు. రథోత్సవం తరువాత రోజునుంచి వాటిని చూసేందుకు, కొనుగోలు చేసేందుకు వివిద ప్రాంతాలకు చెందిన రైతులు వచ్చారు. దీంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. జత ఎద్దులు రూ. లక్షల్లో పలకటం విశేషం. నందవరం మండలం ముగతి, హాలహర్వి, మంత్రాలయం మండలం చిలకలడోన, కోసిగి మండలం దొడ్డి బెళగల్, పెద్దకడుబూరు మండలం హెచ్ మురవణి, కంపాడు గ్రామాలకు చెందిన కోడెలు, సీమెద్దులు ఆకర్షణీయంగా నిలిచాయి. దొడ్డి బెళగల్‌కు చెందిన కోడెలు ఎంతో ఆకర్షణీయంగా కనిపించాయి. జత ఎద్దులు రూ. 3 లక్షలకు విక్రయించేందుకు రైతు ధర చెబుతుండగా కొనుగోలుదారులు మాత్రం రూ. 2.05 లక్షలకు అడుగుతున్నారు. తక్కువ ధరలకు అడుగుతుండటంతో వాటిని ఏడాది పాటు పోషించిన రైతులు ఆవేదనకు లోనవుతున్నారు. అసలే వర్షాలు లేక, గ్రాసం కొరత తీవ్రంగా ఉండటంతో పశుపోషణ భారంగా మారిందని ముగతి గ్రామానికి చెందిన రైతు రంగనాథ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు పట్టణంలోని టీడీపీ కల్యాణమండపం ముందు రోడ్డుకు ఇరువైపుల వ్యాపారులు విక్రయానికి ఉంచారు. రైతులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా టైర్ల బండ్లు, కాడిమానులు, ఇనుపగొర్రులు, గుంటికలు, దంతెలతో పాటు ఇతర వ్యవసాయ పనిముట్లు అమ్మకానికి ఉంచారు. అయితే గత ఏడాదితో పోల్చితే ఆశించిన స్థాయిలో వ్యాపారాలు లేవని వ్యాపారులు వాపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం మొదలు కాలేదని నాగేష్ ఆచారి అనే వ్యాపారి వాపోయాడు. ఇదిలా ఉండగా రైతుల నుంచి, వ్యాపారుల నుంచి మున్సిపల్ కంట్రాక్టర్లు అధిక మొత్తంలో రుసుములు వసూలు చేస్తుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎద్దుల జతకు రూ. 500, బండికి రూ. 350, గొర్రు, కాడిమానుతో పాటు ఇతర పనిముట్లకు ఒక్కొక్కటి రూ. 20 వసూలు చేస్తున్నారు. ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ఇలా వసూలు చేయటం ఏమిటనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయం మున్సిపల్ అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.





అమ్మకానికి సిద్ధంగా ఉన్న కోడెలు, సీమ ఎద్దులు, విక్రయానికి ఉంచిన ఇనుప గొర్రులు, కాడిమాన్లు, పట్టణంలోని టీడీపీ కల్యాణ మండపం ముందు అమ్మకానికి ఉంచిన టైరు బండ్లు

సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లండి



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన్ కేంద్రం వ్యవసాయశాఖ అధికారి

గోనెగండ్ల, జనవరి 29: సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మళ్లాలని అనంతపురం వ్యవసాయ కళాశాల అధికారి దివాకర్‌రెడ్డి, ఏడీఏ ఖాద్రీ అన్నారు. సోమవారం గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశ భవనంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రావేప్ విద్యార్థులు సమీకృత, సేంద్రియ వ్యవసాయం, హైడ్రో ఫోనిక్స్ ద్వారా సాగు, వర్షపునీటిని ఆదా చేయడం, నీటి కుంటలు, నానో ఎరువులు తదితర విషయాలపై వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఏడీఏ ఖాద్రీ మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు తమ వ్యవసాయ విద్యలో భాగంగా రైతులతో కలిసి చేపట్టిన కార్యక్రమాలను రైతులకు వివరించారు. రైతులు సేంద్రియ వ్యవసాయం చేసి లాభాలు గడించాలని అన్నారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం కళాశాల కో ఆర్డినేటర్ సుజాతమ్మ మాట్లాడుతూ ఎరువులను సమతుల ఎరువులు వినియోగించుకోవాలని కోరారు. నానో ఎరువుల ఉత్పత్తులు వాడాలని అన్నారు. సాగులో రైతులకు గల సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు శ్రీధర్‌రెడ్డి, చందన, లక్ష్మీదేవి, రఘుకుమార్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు, జనవరి 29 : ఆలూరు మండలంలోని మొలగవల్లి గ్రామ శివారులోని గడ్డివాములో దాచిన 11 బాక్సుల కర్ణాటక మద్యాన్ని పోలీసులు సోమవారం గుర్తించారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై ఓబులేష తెలిపారు.

విద్యార్థుల విజయానికి పదో తరగతి తొలి మెట్టు

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 29 : విద్యార్థుల విజయానికి పదో తరగతి తొలి మెట్టు అని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ నిర్వహించిన పదవ తరగతి మోడల్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి వార్షిక పరీక్ష ప్రశ్నాపత్రంపై అవగాహన కల్పించేందుకు ఈ టెస్ట్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జీవితంలో ఉన్నతంగా రాణించి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆడపిల్లల చదువుపై శ్రద్ధ చూపాలి

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 29 : గ్రామీణ ప్రాంతాలలో ఆడపిల్లల చదువుపై శ్రద్ధ చూపాలని రాయలసీమ విద్యాలయం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అరుణ గంధం అన్నారు. సోమవారం మాలపల్లి గ్రామంలో ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రత్యేక శిబిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంప్ జరుగుతున్న తీరు పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ డానియల్ ప్రేమ్‌కుమార్ సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై వలంటీర్లకు అవగాహన ఇచ్చారు. పంచాయతీ సెక్రెటరీ స్వామినాథ్, సంధ్యారాణి, డివిజన్ అధికారి జోనాదన్ విక్లిప్ పాల్గొన్నారు.

వీరశైవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ఆదోని టౌన్, జనవరి 29 : రాజకీయాలలో జంగమ వీరశైవులకు ప్రాముఖ్యత కల్పించాలని జంగమ వీరశైవ హక్కుల పోరాట సమితి నాయకులు ఎండీ భద్రినాథ్ స్వామి, మఠం ఆనందస్వామి, కౌతాళం అమరయ్యస్వామి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, డివిజన్‌లోని పత్తికొండలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును కలిసి జంగమ వీరశైవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జగదీష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీసీవై పార్టీతోనే బీసీలు అభివృద్ధి

తుగ్గలి, జనవరి 29: బీసీవై పార్టీతోనే బీసీలు అభివృద్ధి చెందుతారని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు మిద్దె వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని జొన్నగిరిలో బీసీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక జనాభా కలిగిన బీసీలను రాజకీయ పార్టీలు కేవలం ఓటర్లుగానే చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో బీసీలందరూ ఐక్యమై అగ్రవర్ణాలకు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

'విజ్ఞాన్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

గోనెగండ్ల, జనవరి 29: విద్యార్థుల నుంచి అక్రమంగా అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న విజ్ఞాన్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఖాజ, ప్రధాన కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యలయం ఎదుట అరగంట పాటు నిరసన తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

సత్తాచాటిన నంద్యాల జిల్లా వృషభాలు

ఎమ్మిగనూరు, జనవరి 29: ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతరను పురష్కరించుకొని జిల్లాలోని ఎస్ కొత్తూరుకు చెందిన బీరం బుల్స్ నిర్ణీత సమయంలో 4805.09 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. సోమవారం రెండో రోజు న్యూ క్యాటగిరి విభాగంలో వివిధ ప్రాంతాలకు చెందిన 11 జతల ఎద్దులను యజమానులు పోటీలకు తరలించారు. ఇందులో నంద్యాల జిల్లా ఎస్ కొత్తురుకు చెందిన బీరం బుల్స్ నిర్ణీత సమయంలో 4805.09 అడుగుల దూరాన్ని లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. పోటీల్లోగెలుపొందిన వృషభాల యజమానులకు నిర్వాహకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, బసిరెడ్డి, సోగనూరు భీమిరెడ్డిలు నగదు బహుమతులు అందజేశారు.

రాఘవేంద్ర స్వామి మఠానికి రూ. 1.25 లక్షల విరాళం

మంత్రాలయం, జనవరి 29 : మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సుబ్రమణ్యం అనే భక్తుడు రూ.1.25 లక్షలు అన్నదానం కార్యక్రమానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, అక్షింతలతో ఆశీర్వదించారు.

వడ్డెర్ల హక్కుల కోసం ఉద్యమిస్తాం

● ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



రాఘవేంద్రస్వామి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

మంత్రాలయం జనవరి 29 : వడ్డెర్ల హక్కుల కోసం ఐక్య ఉద్యమానికి శ్రీకారం చుడతామని జాతీయ బీసీ సంఘం కార్యదర్శి వడ్డె నారాయణ అన్నారు. సోమవారం మంత్రాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వడ్డె ఓబన్న చిత్ర పటాన్ని ఊరేగింపుతో భారీ ర్యాలీ నిర్వహించారు. రామవేంద్ర సర్కిల్‌లో రాఘవేంద్ర స్వామికి పూలమాలలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర్లను ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, నాగరాజు, బాలరాజు, చిన్న ఈరన్న, నరసింహ, వెంకటరాజు, ఈరన్న, వీరేష్, రామకృష్ణ, రాకేష్, ధర్మయ్య, కప్పన్న, మాధవ్, విజయ్, జనార్ధన్‌రాజు, కుపేంద్ర, నల్లారెడ్డి, పెద్ద సంఖ్యలో వడ్డెర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ పత్తికొండ

రా... కదలిరా...! పత్తికొండ సభ భారీగా విజయవంతం కావడంతో తెలుగుదేశం శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి పత్తికొండ కంచుకోటగా ఉన్న విషయం తెలిసిందే. ఆదివారం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న రా కదలిరా బహిరంగ సభకు ఏడు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అంచనాలకు మించి పెద్దఎత్తున తరలివచ్చి ఈ ప్రాంతాన్ని జనసంద్రంగా మార్చేశారు. ఇది ఆ పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది. చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా పార్టీ శ్రేణులకు అభినందనలు తెలుపుతూ థ్యాంక్యూ పత్తికొండ అంటూ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సభ విజయవంతానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలు, జనసేన కార్యకర్తలకు, వివిధ వర్గాల ప్రజలకు టీడీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

● రాత్రి బస ముగించుకుని రాజమండ్రి బయలుదేరిన చంద్రబాబు
● సభ సక్సెస్‌తో తమ్ముళ్లలో జోష్



పత్తికొండ నుంచి బయలుదేరుతూ చంద్రబాబు అభివాదం

పత్తికొండ, జనవరి 29 : పత్తికొండలో రాకదలిరా బహిరంగసభతో పాటు రాత్రి బసచేసిన టీడీపీ అధినేత నారాచంద్రబాబునాయుడు సోమవారం ఉదయం 9.50 గంటలకు హెలికాప్టర్‌లో రాజమండ్రి సభకు బయలుదేరి వెళ్లారు. ఆదివారం బహిరంగ సభ అనంతరం జిల్లా ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించిన ఆయన అర్ధరాత్రివరకు తనను కలిసేందుకు వచ్చిన వివిధ ప్రాంతాల నాయకులతో మాట్లాడారు. ఉదయం పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి, కేఈ ప్రభాకర్, మంత్రాలయం ఇన్‌చార్జి తిక్కారెడ్డి, ఆలూరు ఇన్‌చార్జి కోట్లసుజాతమ్మ, ఆదోని ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, కర్నూలు జనసేన ఇన్‌చార్జి సురేష్‌లోపాటు ముఖ్యనేత గుడిసె కిష్టమ్మ, సాంబశివారెడ్డి, బత్తిని వెకంట్రాముడు, తుగ్గలినాగేంద్ర, పురుషోత్తంచౌదరి, మనోహర్‌చౌదరి, రామానాయుడు, తిరుపాల్, గురుస్వామిలు చంద్రబాబును కలిసి మాట్లాడారు. సభను విజయవంతానికి శ్రమించిన అందికీ అభినందనలు తెలిపారు. అల్పాహారం తీసుకున్నాక ప్రత్యేకవాహనంలో ప్రమోద్‌కుమార్ వెంచర్ వద్దఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. హెలికాప్టర్ ఎక్కి ప్రజలకు, నాయకులకు అభివాదంచేస్తూ థ్యాంక్యూ పత్తికొండ అంటూ రాజమండ్రి బహిరంగసభకు భయలుదేరి వెళ్లారు.

రాక్షస ప్రభుత్వాన్ని ఇంటికి పంపుదాం : మీనాక్షినాయుడు

ఆదోని, జనవరి 29 : రాక్షస ప్రభుత్వాన్ని ఇంటికి పంపితేనే తెలుగుజాతికి పూర్వవైభవం వస్తుందని ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్నగారు ఎన్టీఆర్ అన్నట్లు... నేల ఈనిందా... అన్నట్టుగా రా... కదలిరా...! పత్తికొండ సభకు జనం తరలి వచ్చారని, వారందరికీ టీడీపీ రుణపడి ఉంటుందని అన్నారు. మళ్లీ మంచి రోజులు రావాలని సంకల్పం చేయాలని, కొత్త ఏడాది సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు, జనసేన పార్టీ అభిమానులకు, నందమూరి బాలక్రిష్ణ అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నూతనోత్సాహం : ఆలూరు మాజీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు : "రా... కదలిరా...!" భారీ బహిరంగ సభ విజయవంతం కావడంతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొందని ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. ఆలూరులోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలూరు తాలూకాలోని ఆరు మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన తెలుగుదేశం కార్యకర్తలకు, నాయకులకు నందమూరి తారక రామారావు, బాలకృష్ణ అభిమానులకు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆలూరు మాజీ టీడీపీ ఇంచార్జి వీరభద్ర గౌడ్



చంద్రబాబుతో మాజీ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి



చంద్రబాబుతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున చౌదరి,

దేవాలయ స్థలాన్ని ఆక్రమించిన అధికార పార్టీ నేత

● తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా
● స్పందనలో ఫిర్యాదు

మద్దికెర, జనవరి 29: అధికార పార్టీ నాయకుడు అధికారుల అండతో దేవాలయ స్థలాన్ని ఆక్రమించాడని ఎస్సీ కాలనీవాసులు ఆందోళనకు దిగారు. సోమవారం యడవలి గ్రామంలో ఎస్సీ కాలనీలోని సుంకులమ్మ దేవాలయానికి చెందిన ఖాళీ స్థలాన్ని గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఆక్రమించుకున్నాడని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి స్పందనలో తహసీల్దార్ నాగభూషణంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు రాముడు, లాలెప్ప, సుంకన్న, రామాంజినేయులు మాట్లాడుతూ దేవాలయ స్థలాన్ని ఆక్రమించుకోవడం వల్ల భక్తులకు తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నాయని, వెంటనే అక్రమ నిర్మాణాన్ని నిలిపి స్థలాన్ని దేవాలయ అభివృద్ధికి ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో రంగన్న, పెద్దన్న, నడిపి రంగన్న, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ బోల్తా.. ఎంపీటీసీ పరిస్థితి విషమం

మంత్రాలయం, జనవరి 29 : మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి సమీపంలో మోటార్ సైకిల్ బోల్తా పడి కోసిగి మండలం వందగల్లు గ్రామ ఎంపీటీసీ బోయ మల్లికార్జునకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం ఆదివారం రాత్రి జరిగింది. బోయ మల్లికార్జున సొంత గ్రామం నుంచి మంత్రాలయం వస్తుండగా గ్రామ సమీపంలో మోటార్ సైకిల్ బోల్తా పడింది. తీవ్ర గాయాలతో ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

తప్పిన ప్రమాదం

కోసిగి, జనవరి 29: బేతంచెర్ల నుంచి నాపబండ్ల లోడుతో వస్తున్న ట్రాక్టరు కోసిగిలోని స్టేట్ బ్యాంకు సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కన గుంతలోకి ఒరిగిపోవడంతో పక్కనే వ్యాపార దుకాణాలు, ప్రజలు గమనించి ఒక్కసారిగా ప్రజలు పరుగెత్తారు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. సోమవారం ఉదయం ట్రాక్టర్‌లోని నాపబండ్లను అన్‌లోడు చేయడానికి వెళ్తుండగా.. ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

కౌతాళం, జనవరి 29: రానున్న రోజుల్లో రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి అధికారం చేపట్టడం తథ్యమని జనసేనా మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మన్న అన్నారు. మండల పరిధిలోని రౌడూరు గ్రామంలో సోమవారం జనసేనా పార్టీ జెండావిష్కరణ మండల అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారని, ఈ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. సైకో జగన్‌ను రాష్ట్రం నుంచి తరిమి కొట్టేలా ప్రతి టీడీపీ-జనసేన కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామని రైతులకు పెట్టుబడి సహాయం కింద సంవత్సరానికి రూ.20వేలు అందిస్తామని తెలిపారు. త్వరలో మరిన్ని పథకాలతో తెలుగుదేశం, జనసేనా ఉమ్మడి మెనుఫెస్టు ప్రవేశ పెట్టి ప్రజలకు మరిన్ని పథకాలను అందిస్తామని తెలిపారు. అనంతరం పార్టీ జండాను గ్రామ నాయకులు మహమ్మద్, హుసేన్ టీడీపీ నాయకులతో కలసి జండాను ఆవిష్కరించారు.

విద్యలో రాణిస్తేనే భవిష్యత్తు

దేవనకొండ, జనవరి 29 : కళాశాల స్థాయిలో విద్యలో విద్యార్థులు రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శర్మ అన్నారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో కళాశాల దినోత్సవం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యప్రదర్శన ,సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రిన్సిపాల్ ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా ఆస్పరి ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహులు, కళాశాల అధ్యాపకులు బ్రహ్మేశ్వర్లు ,కృష్ణమూర్తి, పరమేష్, వీరగురుడు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

పత్తికొండటౌన్, జనవరి 29: దూదేకొండ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ ఎంపీటీసీ కోలంట్ల పెద్దవీరన్న, సీపీఐ శాఖా కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ స్వప్నకుమారికి సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఎస్సీ కాలనీలో మొదలుకుని కర్నూలు రోడ్డు వరకు ఉన్న కొళాయిలకు నీరు సక్రమంగా అందడం లేదని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

● చంద్రబాబుకు మాదాసి, మాదారి కురువ సంఘం వినతి

పత్తికొండ టౌన్, జనవరి 29: మాదాసి, మాదారి కురువల ఎస్సీ కులధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు చొరవ చూపాలని మాజీ సీఎం చంద్రబాబు నాయుడుకు మదాసి, మదారి కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమలింగ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య కోరారు. ఈ మేరకు పత్తికొండ పర్యటనకు వచ్చిన మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించామని తెలిపారు.

వైభవంగా దేవర

మద్దికెర, జనవరి 29: మద్దికెరలోని సాయినగర్ కాలనీలో వెలిసిన నలివేలి సుంకులా పరమేశ్వరి దేవత దేవర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం మూలవిరాట్ నలివేలి సుంకులా పరమేశ్వరిదేవికి ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దేవాలయం నుంచి అమ్మవారికి పందిరి వేయడానికి మేళతాళాలతో వచ్చి పూజలు చేశారు. సర్పంచు బండారు సుహాసిని ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవరను పురస్కరించుకొని సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత పౌరాణిక నాటకం ఆకట్టుకుంది.

పంట నష్ట పరిహారం ఇవ్వండి

దేవనకొండ, జనవరి 29 : రైతులు అప్పులు చేసి సాగు చేస్తే పెట్టుబడి రాక నష్టపోయారని, పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం నాయకులు వీరశేఖర్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ఏడాది కరువు మండలంగా ప్రకటించి పరిహారం ఇవ్వక పోవడంతో రైతులు అప్పులు తీర్చేందుకు వలస బాట పట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆశోక్, మహబుబ్‌బాషా, సూరి, బజారి, రాముడు, బడేసాబ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌మోర్చా పత్తికొండ ఇన్‌చార్జిగా రంగన్న



నియామక పత్రాన్ని అందుకుంటున్న సీసీ రంగన్న

పత్తికొండ టౌన్, జనవరి 29: పత్తికొండ బీజేపీ అసెంబ్లీ కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా సీసీ రంగన్న నియమితులయ్యారు. పట్టణానికి చెందిన సీసీ రంగన్న విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ, బీజేపీ అనుబంధ విభాగాలలో పనిచేస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు నీలకంఠ పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి హోసూరు బ్రహ్మయ్య చేతుల మీదుగా రంగన్న నియామక పత్రం అందుకున్నారు. అనంతరం నూతనంగా నియమితులైన సీసీ రంగన్నను స్థానిక పార్టీ నాయకులు శాలువా పూలమాలలతో సత్కరించారు. కిసాన్‌మోర్చా కార్యదర్శులు సురేంద్ర, గోరంట్ల, మండల అధ్యక్షుడు శంకరయ్య, న్యాయవాది భాస్కర్, నరేష్, చంద్ర, లక్ష్మణనాయుడు తదితరులు పాల్గొన్నారు.